క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ. 5.51 లక్షలు



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న భూనీల సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం చేపట్టామని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఆలయ తనిఖీ అధికారి వి. సుధాకర్ సమక్షంలో భక్తులు లెక్కించిన కానుకలు రూ. 5,51,095 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఇది ఆరు నెలల్లో భక్తులు సమర్పించిన కానుకల మొత్తం అని చెప్పారు.

గుడివాడలో మదరసా ప్రారంభం


గుడివాడ టౌన్: ముస్లింల సంక్షేమానికి మదరసాలు ఎంతగానో తోడ్పడతాయని మదరసా నిర్వాహకులు చాంద్ రాజా అన్నారు. బైపాస్ రోడ్ పిన్నమనేని కాలనీలో నూతనంగా నిర్మించిన హైజానే గరీబీ నవాజ్ ధారుణ్ ఉలూమ్ ఆలా హజారత్ మదరసాను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు పలు కార్యక్రమాలు నిర్వహణకు దీనిని వినియోగించుకునే అవకాశం కల్పిస్తూ భవన నిర్మాణం జరిగిందన్నారు. పట్టణంలోని ముస్లింలందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముస్లిం పెద్దలు సుకూర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

పేదల డాక్టర్‌కు ఘననివాళి



కైకలూరు: పేదల డాక్టర్‌గా పేరుపొందిన దివంగత బత్తిన నరసింహారావు (కాళ్ళపాలెం డాక్టరు) నాలుగో వర్ధంతిని బొల్లినంపాడు అగ్రహారం గ్రామంలో గురువారం నిర్వహించారు. గ్రామంలో ఆయన విగ్రహానికి అభిమానులు, ప్రజలు పూలమాలలు వేసి చేసిన సేవలను కొనియాడారు. పలు కఠినమైన కేసుల్లో సైతం ఆయన ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టారన్నారు. డబ్బుతో సంబంధం లేకుండా సేవ చేయాలనే ఆలోచనతో జీవించిన ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. చిలిముంత నాగరాజు (రాజా), గణపతి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమ ఏర్పాట్లు చేశారు. మరగాని గణపతి, బత్తిన సత్యనారాయణ, చిలుముంత వీర వెంకట మోహన్‌రావు, వెంకట నాగేశ్వరరావు, పెద్ది సోమయ్య, బుసనబోయిన నాంచారయ్య, వేంపటి రామలింగశాస్త్రి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కైకలూరు: నిబంధనల ప్రకారం ప్రతి వాహనానికి ముందు, వెనుక నంబరు ప్లేటు ఉండాలని రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ చెప్పారు. గురువారం భుజబలపట్నం సమీప బ్రాంచీ సెంటర్‌లో నంబరు ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ రవాణాశాఖ అధికారులు కేటాయించిన నంబర్లను ప్రతిఒక్కరూ కనిపించే విధంగా రాయించాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు కొన్ని వాహనాలకు నంబర్లు లేకపోవడంతో గుర్తించడం కష్టతరమవుతోందన్నారు.

అసభ్యకర మెసేజ్‌లపై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు

కైకలూరు: అక్క భర్త తన సెల్‌ఫోన్‌కు అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నాడని మహిళా కానిస్టేబుల్ కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని గుమ్ముళ్లపాడుకు చెందిన ఘంటసాల వాసంతి (30)కి సమీప కొల్లేటికోటకు చెందిన వెంకటేశ్వరరావుకు వివాహమైంది. వాసంతి భీమవరంలో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఆమె భర్త సైతం ఉద్యోగం చేస్తున్నాడు. ఇదిలా ఉంటే గుమ్ముళ్లపాడుకు చెందిన తన అక్క భర్త సైదు స్వామిజీకుమార్ (35) భార్యతో గొడవలు పడుతుంటాడు. ఈ నేపథ్యంలో మరదలు వాసంతి ఫొటోకి తన ఫొటో పెట్టి ఈమె నా భార్య అంటూ సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు చేశాడు. ఇది గమనించిన వాసంతి ఫిర్యాదు చేయడంతో రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ

మొవ్వ: మండల కేంద్రంలోని క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎనిమిది మంది విద్యార్థినులకు గూడపాడు గ్రామానికి చెంది హైదరాబాద్‌లో స్థిరపడిన బొప్పన రాధా కుమారి యూనిఫాంలు పంపిణీ చేశారు. విశ్రాంత బ్యాంక్ అధికారి మండవ కోటేశ్వరరావు చేతుల మీదగా విద్యార్థులకు గురువారం యూనిఫాం అందించారు. ప్రిన్సిపాల్ ప్రసాద శాస్త్రి, అధ్యాపకులు ఆనంద్, రంగనాయకులు, వాసు పాల్గొన్నారు.


కరెంటు బిల్లుల చెల్లింపులో నూతన విధానం

- ఏపీసీపీడీసీఎల్ యాప్‌లో మరిన్ని ఫీచర్లు
- విద్యుత్ వినియోగం తెలుసుకునే వెసులుబాటు
- అందుబాటులో గత చెల్లింపుల వివరాలు

కైకలూరు: రిజర్వ్‌బ్యాంకు ఆదేశాలతో భారత్ బిల్ పేమెంట్ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపులలో నూతన విధానం అందుబాటులోకి వచ్చింది. యూపీఐ యాప్స్‌లో పలు బిల్లింగ్ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాక అందులోనే చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం యూపీఐ యాప్స్‌లో పేమెంట్ ఆప్షన్ తీసివేశారు. కరెంటు బిల్లు కట్టాలంటే విద్యుత్‌శాఖ వెబ్‌సైట్‌లో నేరుగా చెల్లించే అవకాశం కల్పించారు. ఏపీసీపీడీసీఎల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో కరెంటు బిల్లులు చెల్లింపుతో పాటు సర్వీసు పరంగా పలు వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించారు. ఈ ఏడాది జూలై -1 నుంచి యాప్‌లలో మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాలి.

అందుబాటులో కొత్త ఫీచర్లు....

గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీసీపీడీసీఎల్ మొబైల్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని వినియోగదారుడు 13 అంకెల సర్వీస్ నంబర్ నమోదు చేసుకోవడం ద్వారా యాప్ సేవలను పొందవచ్చు. ఇందులో రిజిస్టర్ సెల్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకుని లాగిన్ ఇవ్వాలి. తర్వాత యాప్‌లో 'బిల్ పే' ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎలాంటి అదనపు రుసుము లేకుండా సులభంగా కట్టవచ్చు. వినియోగదారు సర్వీసులకు సంబంధించి విద్యుత్ వియోగం బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకునేలా సరికొత్త 9 ఫీచర్లు అందుబాటులో ఉంచారు.



గూగల్ ప్లే యాప్‌లో అందుబాటులో ఫీచర్లు

సమస్త సమాచారం యాప్‌లోనే.....

ఈ యాప్‌లో పేమెంట్ హిస్టరీలో ప్రతినెలా చెల్లించిన బిల్లుల వివరాలు చూసుకోవచ్చు. వీటితో పాటు ఎన్ని యూనిట్లు వినియోగించాం.. కరెంటు బిల్లు ఎంత.. ఇతర చార్జీల వివరాలతో కలిపి మొత్తం బిల్లు ఎంత అనే వివరాలు తెలుసుకోవచ్చు. వీటితో పాటు లైట్, ట్యూబ్ లైట్, ఫ్రిజ్, ఏసీ, కూలర్, ఫ్యాన్, ఐరన్ బాక్స్, గీజర్, వాషింగ్‌మెషిన్, టీవీ, మిక్సీ, గ్రైండర్, కంప్యూటర్, నీళ్ల మోటర్ వంటి విద్యుత్ పరికరాలు ఎన్ని ఎంత సేపు వాడితే నెలకు ఎన్ని యూనిట్లు రావచ్చు అనే అంచనా వివరాలు తెలుసుకోవచ్చు. ఇంక సర్వీసు ఏ సెక్షన్ పరిధిలో ఉంది, ఏ ఫీడర్, ఏ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా వస్తున్నది, ఏఈ, డీఈ నంబర్లు కూడా అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ఫిర్యాదులు చేసుకునే సౌలభ్యమూ ఉంది. మీటర్, బిల్లింగ్, సప్లయ్, ఇన్సిడెంట్, ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ వంటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. ఏవరైనా అద్దె ఇంటిలో నెల మధ్య ఇల్లు ఖాళీ చేసినప్పుడు అప్పటివరకు విద్యుత్ వాడకం తెలుసుకునే అవకాశం ఉంటుంది.

విద్యుత్ బిల్లులు చెల్లించే ఏపీసీపీడీసీఎల్ యాప్

యాప్ వాడకం సులభతరం



రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు ఇకపై విద్యుత్ బిల్లులు ఏపీసీపీడీసీఎల్ యాప్‌లో మాత్రమే చెల్లించాలి. మీ సేవ, గ్రామ సచివాలయాలు, విద్యుత్‌శాఖ ఈఆర్‌వో సెంటర్లలో కూడా చెల్లించవచ్చు. ఇప్పటికే విద్యుత్‌శాఖ సిబ్బంది ప్రజలకు యాప్‌పై అవగాహన కలిగించారు. యాప్ చెల్లింపులు నేరుగా సంస్థ ఖాతాలోకి చేరుతాయి. యాప్‌లో అన్ని సౌకర్యాలు కల్పించారు. విద్యుత్ వినియోగంలో ఎటువంటి సమస్యలు ఉన్నా 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చు.

– టి.రామకృష్ణ, విద్యుత్‌శాఖ ఈఈ, గుడివాడ

తల్లి పాలతో రోగ నిరోధక శక్తి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): పుట్టిన బిడ్డకు గంట లోపు తల్లి పాలు తాగిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందని వెంట్రప్రగడ, పెదపారుపూడి సెక్టార్ సూపర్‌వైజర్స్ ఎం. శివనాగమణి అరుణకుమారి తెలిపారు. మండలంలోని వెంట్రప్రగడ, భూషణగుళ్ళ గ్రామాల్లో గురువారం ఐసీడీఎస్ అధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్స్‌లు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఇవ్వటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. తల్లికి రొమ్ము, గర్భసంచి క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంట్రప్రగడలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివనాగమణి

అమ్మపాలు.. అమృతం

జమీగొల్వేపల్లి(పామర్రు): బిడ్డకు తల్లి పాలు అమృతంలా పని చేస్తాయని, పుట్టిన అరగంటలోపు తల్లి పాలు తాగించడం వల్ల శిశువుకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపారు. మండల పరిధి జమీగొల్వేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు వాధి నిరోధక శక్తి పెరుగుదల, మెదడు ఎదుగులతో పాటు, పిల్లలు చురుగ్గా ఉండేలా చేస్తాయని పేర్కొన్నారు. బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని చెప్పారు. శిశువుకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. సాధారణ ప్రవసం అయితే పుట్టిన అరగంటలోపు, సిజేరియన్ అయితే నాలుగు గంటల్లోపు తల్లిపాలు పట్టించాలని స్పష్టం చేశారు. ముర్రుపాలలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయని వెల్లడించారు. శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, ఇన్‌ఫెక్షన్స్ రాకుండా నివారిస్తాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్.శాంతకుమారి, ఎంపీటీసీ వై.అరవింద్, హెచ్‌వీ వీరమ్మ, ఆశా వర్కర్స్ అంగన్‌వాడీ కార్యకర్తలు కె.వనజాక్షి, ఎం.రాణి, పి.ఉమామహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



జమీదగ్గుమిల్లిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తోట్లవల్లూరు: పెనమకూరు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణా నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక మరమ్మతుల కారణంగా పెనమకూరు, చాగంటిపాడు, కనకవల్లి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

8న బహిరంగ వేలం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి పలు అంశాలకు ఈ నెల 8న బహిరంగ వేలం నిర్వహిస్తామని సహాయ కమిషనర్ నేల సంధ్య గురువారం తెలిపారు. స్వామివారికి భక్తులు సమర్పించే కొబ్బరికాయల చెక్కలను పోగు చేసుకునేందుకు ఏడాది కాల పరిమితికి వేలం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఎ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపు నెంబరు-3ను ప్రతి నెలా అద్దె చెల్లించే విధంగా బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని చెప్పారు.

తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు

గుడివాడ టౌన్: నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తక్కువ ధరకే సరుకులు విక్రయిస్తున్నట్లు ఆర్డీవో పి. పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైతు బజారు లోని సేల్స్ పాయింట్, డీ- మార్ట్, మోర్ సూపర్ మార్కెట్, ఉషోదయ సూపర్ మార్కెట్, విశాల్ సూపర్ మార్కెట్ లలో కందిపప్పు రూ. 150, స్టీమ్ రైస్ రూ. 48, రా బియ్యం రూ. 47కు అందుబాటులో ఉంచామని చెప్పారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత

గుడివాడరూరల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి విజయవాడ వెళ్లి పింఛను నగదు అందజేశారు. మండలంలోని లింగవరం గ్రామానికి చెందిన మారెళ్ల సూర్యప్రకాశరావు అనే వృద్ధుడు ఎముక విరిగి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వీఆర్వో కొల్లూరి సుబ్బారావు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వృద్ధుడికి రూ.4 వేలు పింఛను, ఆయన భార్య కనకదుర్గకు అభయహస్తం కింద రూ.500 పింఛను అందచేశారు.

ముదినేపల్లి రూరల్: మండలంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు 9022 మంది ఉండగా వీరికి సచివాలయ సిబ్బంది ద్వారా ఉదయం నుంచే పింఛన్లు అందజేశారు. పలు గ్రామాల్లో కూటమి నేతలు స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు అందించారు.



వృద్ధుడికి పింఛను అందిస్తున్న వీఆర్వో

పాస్టర్స్ ఫెలోషిఫ్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

పామర్రు: పామర్రు టౌన్, రూరల్ పాస్టర్స్ ఫెలోషిఫ్ అసోసియేషన్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ నాయకులు సాల్మన్ కొల్లాబత్తుల, డాక్టర్ జువ్వనపూడి ఆదాంతో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యాలయం పాస్టర్లుకు ఒక సెంటర్‌గా ఉండాలని తెలిపారు. అనేక సమాజ కార్యక్రమాలను ఇక్కడి నుంచి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు టి.షాలెంరాజు, ఎం. శామ్యూల్, జి.సత్యకుమార్, కె.శ్రీనివాస్, కె.యోహాను, ఎ.ఆదాము, వి. సునీల్, ఎంవీ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యా కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

మొవ్వ: ఈ నెల 8వ తేదీన పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికల నిర్వహణకు మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మండల పరిధిలో 8 జిల్లా పరిషత్, 1 ఎయిడెడ్, 3 ఎంపీయూపీ, 46 ఎంపీ ఎలిమెంటరీ స్కూల్స్‌లో ఈ ఎన్నికలు నిర్వహిస్తామని ఎంఈవో ఎస్.శివకుమార్ తెలిపారు.

పాఠశాల యాజమాన్య కమిటీల ఎంపికకు శ్రీకారం

ముదినేపల్లి రూరల్: పాఠశాల యాజమాన్య కమిటీల ఎంపికకు గురువారం శ్రీకారం చుట్టారు. గతంలో ఏర్పాటైన కమిటీల పదవీకాలం పూర్తికావడంతో కొత్త కమిటీల ఎంపికకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఓటర్ల జాబితాలను ఆయా పాఠశాలల్లో గురువారం ప్రదర్శించారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈ నెల 5లోపు తెలియజేయాలని నోటిఫికేషన్లో పేర్కొన్నారు. ఎన్నికల ముగింపు ప్రక్రియ 8న పూర్తిచేస్తారని, అదే రోజు ఎంపికైన కమిటీల సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తామన్నారు.



పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

చిచ్చు పెట్టేందుకే వర్గీకరణ

కైకలూరు: అన్నదమ్ములుగా కలసి ఉన్న మాలమాదిగల మధ్య చిచ్చుపెట్టడానికే ప్రభుత్వాలు వర్గీకరణ అంశాన్ని తీసుకొచ్చాయని ఏలూరు జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు ఈదా పద్మారావు విమర్శించారు. కలిదిండి మండలం వెంకటాపురం గ్రామంలో ఆయన మాట్లాడుతూ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే వర్గీకరణ అంశాన్ని నాయకులు తీసుకొచ్చారన్నారు. రానున్న రోజుల్లో మాలలంతా ఏకమై రాజకీయ నాయకులకు బుద్ధి చెబుతాం అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏసురత్నం, ఈదా కార్తీక్, రవి, శ్రీను, సువర్ణరాజు పాల్గొన్నారు.

వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ హర్షం

గుడివాడ టౌన్: షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని గుడివాడ మాదిగ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. నెహ్రూచౌక్ సెంటర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు. గత 30 సంవత్సరాలుగా ఈ విభజనపై చేస్తున్న పోరాటానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగ సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కంచర్ల సుధాకర్, అత్తాటి సాల్మన్, వెంపటి సైమన్, కె. బాబూరావు, మామిళ్ల ఎలీషా, విక్టర్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ సమంజసమంటూ ఉన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైన తీర్పు అని బీజేపీ మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ సూరే గాంధీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్గీకరణకు జాతీయ స్థాయిలో బీజేపీ మద్దతు ప్రకటించిందని పేర్కొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కైకలూరు: మాదిగ, ఉపకులాల చిరకాల న్యాయ పోరాటం ఫలితంగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై గురువారం జాన్‌పేటలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు. మంద కృష్ణ మాదిగ 30 సంవత్సరాల ఉద్యమ ఫలితంగా ఇది సాధ్యమైందన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీల భవిష్యత్తు బంగారుమయం కానుందని చెప్పారు. కార్యక్రమంలో పిల్లనగ్రోవి అబ్రహాం, గొనా శరత్, పిల్లనగ్రోవి సతీష్, అబ్బులు, సద్గుణరావు, రాయినూతల సునీల్, వేల్పూరి విజయ్, రాకేశ్, కొదమల చంటి, పాలపర్తి రాకేష్ పాలపర్తి, జయంత్ హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

వ్యవసాయశాఖ ఏడీ రమాదేవి

గుడివాడరూరల్: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీ నిమ్మగడ్డ రమాదేవి హెచ్చరించారు. గుడివాడ పట్టణం, మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మితో కలసి గురువారం ఆమె తనిఖీ చేశారు. జింకు ఎరువులు, పురుగు మందులను కలిపి అమ్మితే ఎఫ్‌సీవో చట్టం-1968 ప్రకారం దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుకాణాల వద్ద ఎరువుల నిల్వలు, బస్తా ధర అమ్మే వివరాలను అందరికీ కన్పించేలా స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు ఆధార్ నంబర్ తీసుకుని వేలిముద్రలు ఇచ్చి దుకాణాల వద్ద ఎరువులు కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆటోడ్రైవర్లు, ఇతర వ్యక్తులను ఎరువుల కొనుగోలు చేసేందుకు పంపవద్దని చెప్పారు. సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం ఎరువులు సరఫరా చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే రైతులు లిఖిత పూర్వకంగా వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీ రమాదేవి, పక్కన ఏవో అనంతలక్ష్మి

జగనన్నను కలిసిన చంద్రపాల్

గుడివాడ టౌన్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెండా చంద్రపాల్ తెలిపారు. గురువారం తాడేపల్లిలోని జగనన్న నివాసంలో కలిసామని పేర్కొన్నారు. గుడివాడలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, పార్టీ పరిస్థితులను జగనన్నకు వివరించినట్లు చెప్పారు. కార్యకర్తల్లో ధైర్యం నింపేందుకు తాను తిరిగి రాష్ట్రంలో పర్యటిస్తానని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారన్నారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో చంద్రపాల్

పేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పమిడిముక్కల: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. మండలంలోని హనుమంతపురం గ్రామంలో గురువారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని పలువురు లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. పేద వర్గాల వారికి పింఛను నగదు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎమ్మెల్యే కుమార్ రాజాను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగమనేని బాబూరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని బొద్దపాడు, చినపులిపాక, తోట్లవల్లూరు గ్రామాల్లో గురువారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కూటమి నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కుమార్‌రాజా పింఛన్ నగదును అందజేశారు. టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, బొద్దపాడు సర్పంచ్ మూడే శివశంకరరావు, ఎంపీడీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అంజనాదేవి, నాయకులు నిమ్మగడ్డ సీతారాంబాబు, శీలం మధుబాబు, వర్రే చిట్టి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.



హనుమంతపురంలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు: లబ్ధిదారులకు ఠంఛన్‌గా పింఛన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక ఇందిరానగర్‌లోఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, పార్టీ నాయకులు వల్లూరి పల్లి గణేష్, పరసా సుబ్రమణ్యం, ఆంజనేయులు, కేదారేసిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పలువురు అధికారులు

గుడివాడరూరల్: తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కృత్తివెన్ను తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా కాకినాడ జిల్లా కరప మండలానికి బదిలీ అయ్యారు. ఎన్నికల అనంతరం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా గుడివాడ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘన స్వాగతం పలికి పూల బోకేలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవిన్యూ సేవలను ప్రజలకు సులభతరంగా అందేలా చూస్తానని పేర్కొన్నారు. ప్రజలకు రెవెన్యూ సమస్యలు ఏమి ఉన్నా తన దృష్టికి తేవాలని కోరారు. డీటీలు లోకరాజు, కిషోర్, ఆర్ఐ నాగబాబు, వీఆర్వోల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గూడపాటి లక్ష్మణరావు, అనిల్, వీఆర్వోలు సుబ్బారావు, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రంగారావు బాధ్యతలు స్వీకరణ

పెదపారుపూడి: మండల తహసీల్దార్‌గా వై.రంగారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు గోదావరి ఏలేశ్వరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. కార్యాలయ డీటీ వాణి, వీఆర్వోలు భగవంతరావు, ప్రసాద్, ఆనందరావు, శ్రీనివాసరావు తదితరులు తహసీల్దార్ రంగారావుకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.



నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు

గుడ్లవల్లేరు ఎంపీడీఓగా కృష్ణవేణి

గుడ్లవల్లేరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డి.కృష్ణవేణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, మండల పరిషత్ సీనియర్, జూనియర్ అసిస్టెంట్స్ రాణి, బలరామ్, ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులు రమేష్, నరసింహారావు, ఎలీషారావు పుష్పగుచ్ఛాల్ని అందించి అభినందించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన డి.శ్రీనివాస్ పదవీ విరమణ చేశారు.

సీతమ్మ తల్లికి ఆషాఢ సారె

కైకలూరు: సీతమ్మ తల్లికి ఆషాఢ మాస సారెను మహిళలు భక్తిశ్రద్ధలతో గురువారం అందించారు. కైకలూరు డాక్టర్ అప్పారావు వీధిలో శ్రీకోదండరామాలయానికి సమీప మహిళలు పెద్ద ఎత్తున స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అర్చకులు రుద్రపాక మణికంఠ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ నిర్వాహకులు, వార్డు పెద్దలు హాజరయ్యారు.



సారె అందించడానికి వస్తున్న మహిళలు